## సింగిల్ పేజీ కథలు

# ఉపాధి

"ఏమండీ! ఈమెను మన ఇంట్లో సాయానికి పనికి ఉండమని అడిగానండి. పేరు అనసూయ. మన వాళ్లే. భర్త ఈ మధ్యనే పోయాడు. ఒక్కగానొక్క కొడుకు పొట్ట చేత్తో పట్టుకుని దుబాయ్ వెళ్లిపోయాడు. మనం ఇచ్చింది పుచ్చుకుని మనతోపాటే తిని ఉంటుంది, మన ఇంట్లోనే..."

శంకరం గారి భార్య ఉమ చెప్పిన ఈ సందేశం ఆయన్ను గుక్కతిప్పుకోనివ్వలేదు.

"అన్ని విషయాలు, మన యింటి పరిస్థితి అన్నీ చెప్పావా?"

"చెప్పానండీ. మీరేమో రిటైరయిపోయారు. నేనేమో రోగిష్టి దాన్నయిపోయాను. నాకెప్పుడేం జరుగుద్దో తెలియదు...పనీపాట తెలిసింది, సంసార పక్షం ఆడది మనకు తోడుగా ఉంటే బాగుంటుందని"

"సరే నీ యిష్టం"

శంకరం గారు కాలేజీ ప్రిన్స్‌పాల్‌గా పనిచేసి ఏడెనిమిది ఏళ్ల క్రితమే రిటైరయ్యారు. ఈ మధ్యనే చిన్న ఏక్సిడెంట్‌లో కాలికి దెబ్బ తగిలి మంచానికే అతుక్కుపోయారు. అయినా ఆయన ప్రవృత్తికేమాత్రం ఆటంకం రాలేదు. ఆయన పేరు పొందిన కవి. ఆయన రచనలు తెలుగు తెలిసిన వాళ్ళందరి మెప్పు పొందాయి. రాష్ట్ర ఉత్తమ ఉపాధ్యాయ పురస్కారం, జాతీయ ఉత్తమ ఉపాధ్యాయ పురస్కారం పొందారు. ఆయన రాసిన కావ్యానికి కేంద్ర సాహిత్య అకాడమీ పురస్కారమూ లభించింది. ఎప్పుడూ ఏదో రాస్తూనే ఉంటారు. పుస్తకాల షాపులో ఆయన పుస్తకాలకు మంచి గిరాకీ ఉంది. పెన్షన్‌కి ఈ ఆదాయం తోడవడంతో కుటుంబ ఖర్చులకీ, భార్య అనారోగ్యానికయ్యే మందులూ, డాక్టరు ఖర్చులకు లోటుండటంలేదు. ఆయనేనాడు పిల్లల సంపాదన కోసం ఎదురు చూడలేదు.

అనసూయ త్వరలోనే ఇంట్లో మనిషిలా మారిపోయింది. ఉమకు మందులూ, మాకులూ ఇవ్వడం, వంటా వార్పూ అన్నీ ఒంటిచేత్తో చేసుకోగలుగుతోంది. వేరే పనిమనిషి అవసరమూ లేకుండాపోయింది.

శంకరంగారి పనులన్నీ తనే తీసుకుని 'భర్తకే మాత్రం సేవ చేయలేకపోవడమే గాక ఆయన చేత్తో (కాలికి దెబ్బ తగిలేవరకూ) చేయించుకోవలసిన పరిస్థితి వచ్చింది' అనే చింత ఉమకు లేకుండా అనసూయ ఆ కుటుంబావసరాలకు తగినట్టుగా అతుక్కుపోయింది.

* * *

"అబ్బ నొప్పండీ" నిద్రలో ఒక గావుకేక పెట్టింది. ఉమ, శంకరంగారి కంటే ముందే అనసూయ లేచి



"ఏంటమ్మా" అంటూ దరికి చేరింది. అప్పటికే ఉమ మెలికలు తిరిగిపోతున్నది. శంకరంగారు ఉమ దగ్గరకు చేరి కంగారుపడిపోయారు. అంత బాధలోనూ కళ్లు తెరిచి "ఏమండీ ఈ బాధ తట్టుకోలేకపోతున్నాను. పిల్లలకు ఫోన్లు చేయండి" శంకరంగారు ముందుగా డాక్టరుకు ఫోను చేస్తే ఆయన క్షణాల్లో వచ్చాడు. ఇద్దరబ్బాయిల్లో ఒకడు న్యూఢిల్లీలో, ఒకడు బొంబాయిలో ఉన్నారు. వాళ్ళకూ ఫోన్లు చేశారు.

డాక్టరు ఇంజెక్షన్ ఇచ్చినా బాధ ఉపశమించలేదు. శంకరంగారిని సైగతో తన దగ్గరకు పిలిచింది. "నేను మీకు అన్యాయం చేసి పోతున్నానండీ. పిల్లల్ని చూసే అదృష్టం కూడా లేదేమో! మన కుటుంబానికిక ఆధారం అనసూయే. ఆమెని వదిలిపెట్టకండి"

తెల్లవారింది. ఉమ జీవితమూ తెల్లారిపోయింది. పిల్లలు రాకముందే ఉమ పైలోకానికి తరలి వెళ్లిపోయింది.

ఉమ అంత్యక్రియలు పూర్తయ్యాయి. బిడ్డలు ఎవరి ఊళ్లకు వాళ్లు వెళ్లిపోయారు. తండ్రిని తమతో రమ్మని వాళ్లూ అడగలేదు. ఒకవేళ అడిగినా ఆయన వెళ్లేవాడు కాదేమో! ఆ యింటితో, ఆ వూరితో ఆయన అనుబంధం, భార్య స్మృతులతో నిండిన తన పరిస్థితీ ఆయన్ని కదలనియ్యలేదు.

భార్య మరణం శంకరం మాష్టారిని కృంగదీసింది. తెలీనిస్తబ్ధతతో రచనా వ్యాసంగమూ నిలిచిపోయింది. అన్ని పనులూ అనసూయ సకాలంలో చేసిపెడుతున్నా అశాంతితో ఆరోగ్యం దెబ్బ తిన్నది.

ఉమ సంవత్సరీకం సామాన్యంగా జరిగిపోయింది. పిల్లలూ వచ్చారు, వెళ్లారు. ఉన్నట్టుండి ఒక వార్త అందరినీ ఆశ్చర్యపరిచింది. డెబ్భైయేళ్లు దాటిన శంకరం మాష్టారు అరవై దాటిన అనసూయను రిజిష్టరు మేరేజీ చేసుకున్నారనే వార్త. ఇది విని పిల్లలిద్దరూ కుటుంబాలతో సహా వచ్చి ఆయన్ని అనరాని మాటలు- కాదు తిట్టి వెళ్లారు. కోడళ్లయితే "ఈ వయస్సులో ఈయనకిదేం మాయరోగం! హవ్వ! ఈ ముసలాడికి పెళ్లాం కావలసివచ్చిందా! పదండి, ఈయన ముఖం చూస్తేనే మహాపాపం!" అంటూ శాపనార్థాలు పెట్టారు.

ఎవరేం చేసినా, చెయ్యకపోయినా కాలచక్రం పరిభ్రమిస్తూనే ఉంటుంది. కొద్ది నెలల్లోనే శంకరం మాష్టారు కన్ను మూశారు. కబురు తెలిసి పిల్లలూ వచ్చారు. అంత్యక్రియలయ్యానిపించేరు. శంకరంగారి వీలునామా బయటపడింది. అది ఆయన బిడ్డలకు రాసిన కడసారి ఉత్తరం.

"నన్ను మీరేమనుకుంటున్నారో నాకు తెలుసును. ఎవరైనా అదే అనుకుంటారు, వీడికీ వయస్సులో శారీరక వాంఛలేమిటి అనీ! నా తదనంతరం ఈ యిల్లు,

స్థలం - ముందుగా రాసినట్టుగానే మీ యిద్దరికీ చెందుతుంది. చట్టప్రకారం నా భార్య అనసూయకు నా పెన్షన్‌లో సగభాగం ఆమెకు తన జీవితకాలం లభిస్తుంది. అందుకే నేనామెను పెళ్లిచేసుకున్నాను. నేనామెను పెళ్లి చేసుకోకపోతే నా పెన్షన్ నాతోనే ఆగిపోయేది. పిల్లలకెలాగూ పెన్షన్ రాదు. మీకూ తెలుసుగదా! మీ అమ్మకూ, నాకూ అనసూయ చేసిన సేవలకు ప్రతిఫలంగా కృతజ్ఞతాభావంతో ఇది నేనామెకు చూపిన ఉపాధి!"

-కొట్టి రామారావు (మచిలీపట్నం)

☆ ☆ ☆

# డామిట్... కథ అడ్డం తిరిగింది!

ఈ ఉద్యోగమేదో పదిరోజుల క్రితం వచ్చుంటే ఎంతో ఆనందపడేవాడు ఓబులేసు. పైపెచ్చు వెంకట్రావుగారి అమ్మాయితో నిశ్చితార్థం కాన్సిల్ చేసుకునేవాడు. పెళ్లి కూడా పదిహేను రోజుల్లో వుంది. ఇప్పుడు ఓబులేసు బాధల్లా ఈ సంబంధాన్ని ఎలా వదిలించుకోవాలనే.

తనకు ఉద్యోగం లేదని తక్కువ కట్నం తీసుకుంటూ పెద్ద అందంగా లేని వెంకట్రావుగారి అమ్మాయి సుజాతను పెళ్లి చేస్కోవాలనుకున్నాడు ఓబులేసు.

తన అదృష్టమో దురదృష్టమో సుజాతతో నిశ్చితార్థం అయిన మరునటి రోజే తనకు ఉద్యోగంలో జాయిన్ అవమని అపాయింట్‌మెంట్ ఆర్డర్ వచ్చింది.

తను అందగాడు (అని ఓబులేసు ఫీలింగు) దానికి తోడు ఇప్పుడు సలక్షణమైన ఉద్యోగం వుంది. అలాంటప్పుడు తను బాగా కట్నం ఇచ్చే వాళ్ల సంబంధమో లేదా సినిమా హీరోయిన్ కరీనా కపూర్‌లాంటి అమ్మాయినో చేస్కోవాలిగానీ, ఓ మోస్తరు అందంగా వున్న సుజాతను పెళ్లిచేస్కోవాల్సిన దుస్థితి తనకేంటని మనస్తాపం చెందుతున్నాడు ఓబులేసు.

ఈ సమస్య నుండి ఎలా బయట పడాలని ఆలోచించగా ఆలోచించగా ఓ మహత్తరమైన ఐడియా తన బుర్రలోకి ప్రవేశించగానే తనని తనే అభినందించుకున్నాడు ఓబులేసు.

* * *

"బాగున్నావా బాబు" కాబోయే అల్లుడు ఓబులేసు తమ ఇంటికి వచ్చినందుకు ఆనందంగా పలకరించింది పార్వతమ్మ.


"వేరే పనిమీద పక్కూరుకొచ్చాను- ఎలాగూ ఇంత వరకు వచ్చి మిమ్మల్ని చూడకుండా వెళ్లడం మంచిది కాదని వచ్చాను" అతికినట్లు వుండే అబద్ధాన్ని చెప్పాడు ఓబులేసు.

కిచెన్‌లోకి వెళ్లి మంచినీళ్ళు తీసుకుని వచ్చి ఓబులేసుకు ఇచ్చింది పార్వతమ్మ.

"మావయ్యగారు లేరా అత్తయ్యా?" తాగాక గ్లాసు పక్కనపెడుతూ అడిగాడు.

"పెళ్లి బట్టలు కొంటానికి సుజాత, మీ మావయ్య వెళ్లారు" అంది ఎదురుగా వున్న కుర్చీలో కూర్చుంటూ పార్వతమ్మ. ఓబులేసు ఏవో కబుర్లు చెప్పుకుంటూ వున్నారు. ఇంతలో ఓబులేసు కుర్చీలోనుండి కిందపడి గిలగిల కొట్టుకోసాగేడు.

అది మూర్ఛవ్యాధి అని తెల్సుకున్న పార్వతమ్మ తాళం చెవులు తెచ్చి ఓబులేసు చేతిలో పెట్టింది. ఓ ఐదు నిముషాల తర్వాత ఓబులేసు స్పృహలోకి వచ్చాడు.



"ఏంటి బాబూ. నీకు మూర్ఛవ్యాధి వుందా?" ఆందోళనగా అడిగింది పార్వతమ్మ.

"ఔను అత్తమ్మ- మా ఇంట్లో వాళ్ళు మీకు చెప్పలేదా?" అన్నాడు ఓబులేసు.

'లేదు' అన్నట్లు తలాడించింది పార్వతమ్మ.

"నాకీ జబ్బు చిన్నప్పట్నుంచి వుంది- ఎంతోమంది డాక్టర్లకు చూపించాను అయినా ఫలితం లేదు" అని క్యాజువల్‌గా చెప్పాడు ఓబులేసు, జేబులోనుండి సిగరెట్ తీసి వెలిగించుకుంటూ.

ఓబులేసుకు ఏ చెడు అలవాట్లు లేవనుకొని సంబరపడ్డ పార్వతమ్మకు చుక్కెదురైంది.

ఇదివరకు ఆనందంగా మాట్లాడిన పార్వతమ్మ మొహంలో ఆందోళన చోటు చేసుకోవడంతో తన పాచిక పారిందని ఓబులేసు లోలోనే సంతోషించాడు.

ఓబులేసు ఎప్పుడెళ్లిపోయాడో కూడా గమనించనంత ఆలోచన్లో వుంది పార్వతమ్మ.

* * *

ఓబులేసు ఊహించినట్టుగానే వెంకట్రావు గారి వాళ్ల సంబంధం కాన్సిల్ అయింది.

ఆ మరుసటి రోజే పెళ్లిళ్ల పేరయ్యను పిలిపించి మంచి సంబంధాలు చూడమని పురమాయించాడు ఓబులేసు.

అనుకున్నామని జరగవు అన్నీ అన్నట్లు ఓబులేసుకు అమ్మాయిని ఇవ్వడానికి ఎవ్వరూ ముందుకు రాలేదు. పెద్ద డాక్టర్లక్కూడా లొంగని మూర్ఛవ్యాధి ఓబులేసుకు వుందని ఊరూవాడా ప్రచారం అయిపోయింది. తన గొయ్యి తనే తవ్వుకున్న చందాన తయ్యారైంది ఓబులేసు బతుకు. కట్నం అక్కర్లేదు, అమ్మాయి అందంగా లేకపోయినా ఫర్వాలేదు అన్నా ఏ సంబంధం కుదరలేదు. ఇలా వుండగానే ఓబులేసు పాతికేళ్ళ వయసు ముప్పైకి చేరుకుంది. గోరుచుట్టుపై రోకలిపోటు అన్నట్టు ఓబులేసు వయసు థర్టీ ప్లస్ అయినా చూట్టానికి ఫార్టీ ప్లస్‌లా కనిపిస్తాడు.

కర్ణుడి చావుకు వంద కారణాలు అన్నట్లు ఓబులేసు వయసు నలభైకి దగ్గరపడ్డంతో వయసు మళ్ళిన వాడికింద జమకట్టి పెళ్లిళ్ల పేరయ్యలు కూడా సంబంధాలు చూడ్డం మానేశారు.

ఒకరోజు ఎవరో దంపతులు తమ ఇద్దరు పిల్లలతో షికారుకి వెళుతూ జోకులు వేసుకుంటూ చూడముచ్చటగా వున్నారు. తెలిసిన వాళ్లలా అనిపించేసరికి ఓబులేసు వాళ్లని పట్టి పట్టి చూశాడు. ఆమె వెంకట్రావుగారి అమ్మాయి సుజాత.

బుద్ధి తక్కువ పని చేసి ఆమెతో పెళ్లి కాకుండా చెడగొట్టుకున్నందుకు సిగ్గుతో వాళ్లకి మొహం చూపించలేక మలుపు తిరిగి మరో దారిన వెళ్లిపోయాడు ఓబులేసు.

-ఎం.గాంధీ (హైదరాబాద్)